క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నాగార్జునసాగర్ : పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు దరాఖాస్తులు చేసుకునే అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు నాగార్జునసాగర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. టీఎస్ పాలిసెట్ -2023ర్యాంక్ కార్డు(అర్హత పొందిన అభ్యర్థులకు) పదో తరగతి లేదా తత్సామానమైన మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్ (నాల్గవతరగతినుండి 10వతరగతి వరకు), బదిలీ సర్టిఫికెట్ (టీసీ), కులధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలలోనైతే ఫీజు రూ.5,080లు, ప్రైవేటు, ఏయిడెడ్ కళాశాలల్లోనైతే రూ.15,780లు ఉంటుందని తెలిపారు.

సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

దేవరకొండ : ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 31న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనాలకు రూ.10వేలు, ఫోర్ వీలర్ వాహనాలకు రూ.30వేలు డిపాజిట్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వేలంపాటలో ఎలాంటి వాహనాలు కొనని పక్షంలో డిపాజిట్ తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మండల్ సిఫారసులను అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్ : బీపీ మండల్ సిఫారస్సులను తక్షణమే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శనివారం తిరుపతిలో ఆగస్టు 8న నిర్వహించే జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, నాగేశ్వర్‌రావు, తిరందాసు విష్ణు, ఉరిబండి శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

అడవిదేవులపల్లి : గ్రామ పంచాయతీ భవనంలో శనివారం సీఎస్‌సీ హెల్త్ కేర్, కార్మిక శాఖల ఆధ్వర్యంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ప్రధానంగా హెల్త్ స్కానింగ్‌తో పాటు రూ.15వేల విలువగల ఆరోగ్య పరీక్షలు, 132పారామీటర్ల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్త మర్రెడ్డి, ఉప సర్పంచ్ కేశబోయిన కొండల్, హెల్త్ కేర్ సెంటర్ కన్సలట్టెంట్ నేరేళ్ల అజయ్, నేహ్రూ యువ కేంద్రం వలంటీరీలు కలకొండ హరీష్‌లతో పాటు భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

గుర్రంపోడు : మండలంలోని పోచంపల్లిలో శుక్రవారం రాత్రి పీర్ల పండుగలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన బొంగరాల శ్రీను, బొంగరాల వెంకన్నలను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడగా తీవ్ర గాయాలు అయ్యాయి. వీరు హైద్రాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. శ్రీనుకు తలకు గాయం కాగా వెంకన్న కాలు విరిగింది. దాడికి పాల్పడ్డ గ్రామానికి చెందిన మాశిన లింగారెడ్డి మరో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



యాద్గార్‌పల్లిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ : అర్హులైన రైతులందరూ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో రైతుబీమా నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో 190 మంది రైతుబీమాకు అర్హులుగా ఉన్నారని, 18-59 సంవత్సరాలలోపు వారు పట్టా ఉన్న రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదమ్మశ్రీనివాస్, ఏఈఓ సైదానాయక్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఎర్రయ్య, మల్లయ్య, రవి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంటల గ్రామంలో శనివారం సర్పంచ్ రుద్రమ్మ ఆధ్వర్యంలో హరితహారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుండాల వెంకటయ్య పాల్గొన్నారు.

పాఠశాలలే క్రీడా మైదానాలు.!

- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- సమయం దాటాక బడులకు తాళం
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు
- ఇంకా 28 గ్రామాల్లో స్థలాల కొరత



పాఠశాలలో ఏర్పాటు చేసిన యల్లాపురం క్రీడా ప్రాంగణం



కంపచెట్లతో ఉన్న అల్వాల క్రీడా ప్రాంగణం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలని ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ఊరికో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వాటి ఏర్పాటుకు స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. మండలంలో గ్రామపంచాయతీలు, ఆవాస గ్రామాలను కలుపుకుని 49మైదానాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ నేటికీ 21గ్రామాల్లో గ్రామాల్లో మాత్రమే అధికారులు స్థలాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అందులో రెండు గ్రామాల్లో అల్వాల, కొంపల్లి గ్రామాల్లో మాత్రమే ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఏర్పాటు చేశారు. మిగతా 19 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలనే క్రీడా మైదానాలుగా మార్చి, పాఠశాల బోర్డు ముందు క్రీడా మైదానాల బోర్డును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. జెడ్పీహెచ్ఎస్‌లలో ఏర్పాటు చేసిన వాటిలో మాత్రమే అనువైన స్థలాలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటిలో ఆ విద్యార్థులు ఆడుకోవడానికే స్థలం లేదు, ఇంకా ప్రాంగణాలు ఎలా ఏర్పాటు చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు పాఠశాలల పనివేళలు పూర్తి కాగానే పాఠశాలలకు తాళాలు వేసి వెళ్లిపోతారని, దీంతో అవి క్రీడాకారులకు ఎలా ఉపయోగపడతాయని అని ప్రశ్నిస్తున్నారు.

ఏర్పాటు చేసినా..

ఈ క్రీడా మైదానాల్లో వాలీబాల్, ఖోఖో సింగిల్, డబుల్, ఎక్సర్‌సైజ్ బార్, ఆర్చిసెట్, కబడ్డీ, లాంగ్‌జంప్‌కు సామగ్రిని మండలంలోని మేజర్ గ్రామాలకు ఆయా గ్రామాల సర్పంచులు ముందే వారి సొంత డబ్బులతో తెప్పించుకొని ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని నెలల తరువాత వారికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మరికొన్ని గ్రామాలకు జిల్లా కలెక్టర్ నిధులతో సామగ్రిని మంజూరు చేశారు. ఆ తరువాత జిల్లా కలెక్టర్ ఆయా గ్రామాల నిధులను తిరిగి వెనక్కి తీసుకున్నారు. మండలంలో అనువైన స్థలాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో క్రీడా సామగ్రి అందలేదు. రెండు, మూడు గ్రామాలకు తప్ప, మిగతా అన్ని గ్రామాల్లో అనువైన స్థలాలు లేకపోవడంతో వ్యాయామా, ఆర్చిలతోనే సరిపెట్టారు. అవి కూడా ఇప్పటి వరకు ఉపయోగంలోకి వచ్చిన దాఖలాలు మండలంలో ఎక్కడ కనిపించడం లేదు.ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

నిరుపయోగంగానే ఉంది



మా గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి ఏడాది దాటినా నేటికి నిరుపయోగంగానే ఉంది. ప్రభుత్వ ఆలోచన విధానం బాగుంది. కానీ దానికి అనుగుణంగా వాటిని ఉపయోగంలోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైంది. క్రీడా ప్రాంగణాలకు ప్రత్యేకంగా బీపీఈడీ చేసిన వారిని ఎంపిక చేసి వారి పర్యవేక్షణలో ప్రతి రోజు గ్రామంలోని క్రీడా కారులకు శిక్షణ ఇవ్వాలి. దీంతో నిరుద్యోగులకు కూడా ప్రభుత్వం ఉద్యోగం కల్పించినట్లవుతోంది.

– పెంకీసు పాపిరెడ్డి, సర్పంచ్ అల్వాల

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు వినియోగంలోకి తీసుకురావాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు కూడా ఇప్పటికి చాలా మందికి తెలియదు. ఉపయోగం లేదని దగ్గర ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే ఉపయోగం ఏముంటుంది. గ్రామస్థాయిలో బీపీఈడీ చేసిన వారిని ఎంపిక చేసి వారి పర్యవేక్షణలో క్రీడా ప్రాంగణాలను నడిపించాలి.

– పగడాల రాజశేఖర్, బీపీఈడీ విద్యార్థి

అడవులను సంరక్షిస్తేనే పులులకు మనుగడ

- సాగర్ ఎమ్మెల్యే భగత్



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే భగత్

నాగార్జునసాగర్: అడవులను సంరక్షిస్తేనే పులులకు మనుగడ అని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. అమ్రాబాద్‌టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని నాగార్జునసాగర్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్క నాటి మాట్లాడారు. పులుల సంఖ్య అంతరించకుండా చూడటమే మన లక్ష్యమని తెలిపారు. వాటి సంఖ్య పెరిగేందుకు అవసరమైన మేరకు అడవులను పెంచాలన్నారు. టైగర్స్‌డే సందర్భంగా వారం రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు అడవులపై వ్యాసరచన, వకృత్వ, చిత్రాలు గీయడం లాంటి పోటీలు నిర్వహించాలన్నారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందించారు. అనంతరం ప్రొఫెసర్ సదాశివయ్య పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడుకోవడంలో పాములు రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో పెద్దవూర జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బ్రహ్మానందరెడ్డి, హాలియా, పెద్దవూర మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకటేశంయాదవ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బిన్ని, డీఎఫ్ఓ సర్వేశ్వర్, రేంజ్ ఆఫీసర్లు రాఘవేందర్‌రావు, ఎన్.భాస్కర్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దవూర : మండల కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్‌హాల్ మండలానికి చెందిన 132మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబాకర్ చెక్కులను ఎమ్మెల్యే భగత్ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డితో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జువ్వాజి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ అంతయ్య, బ్రహ్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలకేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 130 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే భగత్ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, వెలుగు రవి, సింగం ప్రవీణ్, దోటి చంద్రమౌళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

దేవరకొండ : బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) దేవరకొండలో నిర్వహించనున్న మహిళా రాజకీయ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఊదరి సైదులు, రాష్ట్ర మహిళా కన్వీనర్ నర్ర నిర్మల పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరల సమావేశంలో వారు మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో రాబోయే ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రమేశ్‌నాయక్, ఎర్ర కృష్ణ, జోనల్ కన్వీనర్ ఇంద్రవల్లి కవిత, జిల్లా కన్వీనర్ ఎలిజబెత్, కవిత, కన్వీనర్ సహాని, లలిత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



రెడ్డికాలనీలో మొక్క నాటుతున్న లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు రెడ్డికాలనీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జీవి మనుగడకు చెట్లు ఎంతో ఆధారమని, మొక్కలను పెంచుకోవడం వలన పర్యావరణ సమతుల్యత జరుగుతుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో బీఎల్ఆర్ బ్రదర్స్ అభిమానులందరు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల మధుసూధన్‌రెడ్డి, రంగనాథ్, కౌన్సిలర్ రామకృష్ణ, స్థానికులు ప్రసాద్, రాజేందర్, వెంకటేశ్వర్లు, అశోక్, నాగేందర్, వెంకట్‌రెడ్డి, ఇంద్రకుమార్, శ్రీనివాస్, శ్రీను, శివ, పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

హాలియా : అనుముల ఎస్సీ గురుకుల పాఠశాలలో ఎకె. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాధన్ సంస్థ ప్రతినిధులతో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సెల్ఫ్ డెవలప్‌మెంట్, టీమ్ బిల్డింగ్, స్టేజ్ ప్రజంటేషన్‌లపై శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా ఎకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్‌ను, సంస్థ ప్రతినిధులను పాఠశాల బృందం శాలువాలతో ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో విద్యాధన్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీప్రసన్న, హరిత, ప్రదీప్, జయచంద్ర, పాఠశాల ప్రిన్సిపల్ రవి కుమార్, ఉపాధ్యాయులు శ్రీరామ్, ఉప సర్పంచ్ తుమ్మరగోటి రమేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలి



త్రిపురారం : తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి



పెద్దవూర : తీజ్ బుట్టలతో గిరిజన మహిళలు

త్రిపురారం : గిరిజన తండాల్లో ఆనవాయితీగా వస్తున్న రిజన సంస్కృతి, సాంప్రదాయాలను గిరిజనులు కాపాడుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని గిరిజన తండాల్లో తొమ్మిది రోజులుగా జరుగుతున్న తీజ్ వేడుక ముగింపు కార్యక్రమాన్ని శనివారం గిరిజనులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీజ్ పండుగకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండల ఎంపీపీ భగవాన్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధనావత్ ధన్‌సింగ్ నాయక్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రవి కుమార్ నాయక్ గిరిజనులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాలొన్నారు.

పెద్దవూర : మండలంలోని జయరాంతండాలో తీజ్ సంబరాలను శనివారం గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గిరిజన యువతులు, మహిళలు ధరించిన ప్రత్యేక వస్త్రాలు, నత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. గిరిజన కుల దేవతలైన మేరిమయాడీ, సేవలాల్ మహారాజ్‌లకు భోగ్‌బందార్‌తో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీపాచీనానాయక్, ఎంపీటీసీ రమావత్ శ్రీరాములు, తండావాసులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

అడవిదేవులపల్లి : మండలంలోని నల్లమిట్టతండాకు చెందిన గిరిజన మహిళ రమావత్ మౌనిక శనివారం 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. అడవిదేవులపల్లి మండలం నల్లమిట్టతండకు చెందిన రమావత్ సైదా భార్య మౌనికకు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పురిటినొప్పులు రావడంతో గ్రామ ఏఎన్ఎం ఆదిలక్ష్మికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన ఏఎన్ఎం 108కు సమాచారం అందించింది. వెంటనే 108 వాహనం ద్వారా మౌనికను నేతాపురం మీదుగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోని నేతాపురం సమీపంలో మరింత పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్ సిబ్బంది నార్మల్ డెలవరీ చేశారు. దీంతో మౌనిక పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారు. మౌనిక ప్రసవం చేయడం వలన 108 సిబ్బంది స్వప్న, పరమేష్, ఏఎన్ఎం ఆదిలక్ష్మిలకు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల స్థలాల పంపిణీలో తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ : పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీలో ఎమ్మెల్యే నోముల భగత్ తమకు అన్యాయం చేశారని నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన పేదలు షేక్ రేష్మా, షేక్ రజియా, షేక్ రేష్మాతోపాటు మరో ఇద్దరు ఆరోపించారు. శనివారం మిర్యాలగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ముకుందాపురం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పడంతో మొత్తం 300 మంది దరఖాస్తు చేసుకున్నారని అందులో 150 మంది అర్హులను గుర్తించారని తెలిపారు. అందులో 36 మందికి మాత్రమే ఇంటి స్థలాలు ఇచ్చారని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయలేదని ఆరోపించారు. దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీయకుండా అధికార పార్టీ కార్యకర్తలకు, సొంత ఇళ్లు, పొలాలు ఉన్నవారికి ఇంటి స్థలాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే నోముల భగత్‌ను, సర్పంచ్‌ను ప్రశ్నించగా పోలీసులతో బలవంతంగా నెట్టివేయించారని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్డీఓకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇంటి స్థలాల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని సమగ్ర విచారణ జరిపించి నిజమైన పేదలకు ఇండ్ల స్థలాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సుగుణమ్మ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : రిటైర్డ్ టీచర్ శ్రీరాముల సుగుణమ్మ మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడ ప్రాంతంలోని ఎర్రావులపాటు, కాల్వపల్లి, యాద్గార్‌పల్లి, ఉట్లపల్లి తదితర గ్రామాల్లో టీచర్‌గా విధులు నిర్వర్తించి ఎంతో మందిని ఉన్నత స్థానంలో నిలపడానికి తోడ్పాటును అందించిందన్నారు. అనేకసార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిందని గుర్తు చేశారు.ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, నాయకులు సంపత్, కుంకు తిరుపతయ్య, ఆమె కుమారులు శ్రీరాముల సుకుమార్, సంపత్‌కుమార్ లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ బాపురావుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బంజారా సంఘం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : లంబాడీ, ఆదివాసుల మధ్య రెచ్చగొట్టి మరో మణిపూర్‌గా మార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని ఆరోపిస్తూ అదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై బంజారా సంఘాల ఆధ్వర్యంలో శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కులాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి బాపురావు లబ్ధి పొందడం అలవాటుగా మారిందన్నారు. ఫిర్యాదు చేసిన వారిల బంజారా సంఘం నాయకులు మాణ్యనాయక్, సైదానాయక్, దశరథనాయక్, లాలునాయక్, తదితరులున్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాట్లాడిన బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని రంగుండ్ల తండాలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీని తరిమికొట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వీధుల్లో మురుగు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీతారాంపురం, ముత్తిరెడ్డికుంట, బంగారిగడ్డ ప్రాంతాల్లో ఉన్న మెయిన్ డ్రెయినేజీ చెత్తతో నిండిపోయి దోమలు, ఈగలు రావడంతో పాటు దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లు గౌతంరెడ్డి, మంగారెడ్డి, పోలేబోయిన వరలక్ష్మి, బావండ్ల పాండు, పరశురాములు, అంజద్, చెనగాని యాదగిరి, బిక్షం తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు

దేవరకొండ : కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నూనె రామస్వామి, పల్లా దేవేందర్‌రెడ్డిలు అన్నారు. శనివారం దేవరకొండలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా సిమెంట్ హమాలీ రేట్లు పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా హమాలీ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, 50ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.10వేల పింఛన్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూనె వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, నీలా వెంకటయ్య, మలయ్య, కృష్ణయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

వేములపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వేములపల్లికి చెందిన చల్లబొట్ల లక్ష్మారెడ్డి (60), రాచూరి సత్యం మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిని దాటుతుండగా అదే సమయంలో వేములపల్లి నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా సత్యానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



మిర్యాలగూడ టౌన్: అలావు చుట్టూ తిరుగుతున్న యువకులు



పెద్దవూర : పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

హాలియా: మోహర్రం వేడుకలను హాలియా పట్టణంలోని ఇబ్రహీంపేట వార్డులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, మతాలకు అతీతంగా పీర్ల ఎత్తుకొని వీధుల్లో తిరగారు. అనంతరం అలావు చుట్టూ తిరిగారు. ఈ కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు అంజద్‌ఖాన్, అన్వర్‌ఖాన్, పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంతో పాటు పోతునూరు, పులిచర్ల, ఊట్లపల్లి, గర్నెకుంట తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువఝామున సవార్లను ఎత్తుకున్న భక్తులు అగ్ని గుండాల నుంచి వెళ్లారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద మహ్మద్ అహ్మద్‌అలీ సవార్లకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, సత్యనారాయణ, రవి, శ్రీరాములు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కాటేపల్లి రమేష్, నరహరి, కోళ్ల సైదులు, యాదగిరి, కర్నాటి సైదిరెడ్డి, రంజాన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో మోహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుఝామున పీర్లు ఎత్తుకొని అలావు చుట్టూ తిరుగుతూ నిప్పుల నుంచి అవుతలికి ఇవతలికి తిరిగారు గ్రామ పరిసరాల్లో నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అదే విధంగా డప్పులతో కళాకారులు వివిధ రాకల నృత్యాలను చేస్తూ అలరించారు.

అడవిదేవులపల్లి : మోహర్రం వేడుకలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచి అగ్నిగుండం చుట్టూ తిరి సాయంత్రం పీర్లను భావిలో వేశారు. అగ్నిగుండాలను తొక్కి భక్తులు భక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బహీర్, బాబ్జాన్, తదితరులున్నారు.

దయ్యాలగండి మలుపు వద్ద రెండు లారీలు ఢీ

- ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం



వాహనాలను వరుసక్రమంలో పంపిస్తున్న విజయపురి టౌన్ ఎస్ఐ సురేష్

నాగార్జునసాగర్: సాగర్ -హైద్రాబాద్ రహదారిపై దయ్యాలగండి మూలములుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు శనివారం తెల్లవారుజామున ఢీకొనడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. లారీలు రెండు రోడ్డుకు అడ్డంగా నిలువడంతో ట్రాఫిక్‌ను మళ్లించడానికి ఎటువైపు దారిలేక పోవడం వల్ల సుమారుగా నాలుగు గంటలపాటు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్లకు చెందిన లారీ సిమెంటులోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో కోడిపెంట లోడుతో మాచర్లకు వెళ్తోంది. మాచర్ల నుంచి గ్రానైట్ లోడుతో మహారాష్ట్రకు వెళ్తున్న లారీ ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు లారీల ముందుభాగాలు ధ్వంసమయ్యాయి. ప్రాణనష్టం జరుగలేదు. సమాచారం తెలియగానే పోలీసులు జేసీబీ, క్రేన్‌ను తెప్పించి లారీని పక్కకు పెట్టించి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక చేయూత

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని బెట్టితండా గ్రామానికి చెందిన లావూరి బాలాజీనాయక్ ఐఐటీ ఫలితాల్లో 689వ ర్యాంకు సాధించి జమ్మూ ఐఐటీ కళాశాలలో సీటు సాధించాడు. కోర్సు ఫీజు చెల్లించే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శనివారం విద్యార్థి బాలాజీనాయక్‌కు రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాజీనాయక్ ఉన్నత చదువులు అభ్యసించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెట్టితండా గ్రామ సర్పంచ్ లింగానాయక్, బీఆర్ఎస్ నాయకులు రాంబాబునాయక్, పత్తిపాటి నవాబ్, షోయబ్, తిరుమలగిరి వజ్రం, కోటేశ్వర్‌రావు, శ్రవణ్‌రెడ్డి, గోపియాదవ్ పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు